ఎగ్జిబిషన్‌లో వెల్ బేబీ షో



వెల్ బేబీ షోలో విజేతలుగా నిలిచిన చిన్నారులు

అబిడ్స్: నాంపల్లి ఎగ్జిబిషన్‌లో ఆదివారం రాత్రి వెల్ బేబీ షో నిర్వహించారు. ఎగ్జిబిషన్ సొసైటీ, యశోద ఆసుపత్రి సంయుక్తంగా నిర్వహించిన ఈ షోలో మూడు సంవత్సరాల లోపు చిన్నారులు పాల్గొన్నారు. నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన దాదాపు 50 మంది చిన్నారులు ఒకటి, రెండు, మూడు సంవత్సరాల విభాగాల్లో పాల్గొని సందడి చేశారు. ముగ్గురు విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షులు వనం సత్యేందర్, కార్యదర్శి హనుమంతరావు, కోశాధికారి రాజేంద్రకుమార్, కన్వీనర్ డాక్టర్ సంజీవ్ కుమార్, అడ్వైజర్ డాక్టర్ జి.శ్రీనివాస్, జాయింట్ కన్వీనర్ మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పూడికతీతెక్కడ..?

- కచ్చామోరీలు, డ్రైనేజీలు, ఓపెన్‌నాలాల్లో పేరుకుపోతున్న వ్యర్థాలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

చార్మినార్: పాతబస్తీలోని ఓపెన్ నాలాల్లో అక్కడక్కడ చెత్త పేరుకుపోవడంతో మురుగు సాఫీగా ముందుకు వెళ్లడం లేదు. దీంతో ఆయా ప్రాంతాల్లోని డ్రైనేజీలు నిండిపోతున్నాయి. ఇక వర్షాలు కురిస్తే.. వరదనీటితో సమస్యలు తలెత్తుతాయి. ఎప్పటికప్పుడు పూడికతీత పనులు చేయాల్సిన చోట సంబంధిత జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికార యంత్రాంగం చోద్యం చూస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- వర్షానికి ముందే పూడికతీత పనులు చేపడితే ఆశించిన ఫలితాలు ఉంటాయని స్థానికులు అంటున్నారు. కొన్నిచోట్ల పూడికతీత పనుల పేరుతో టెండర్లు కాజేస్తున్న కొంతమంది కాంట్రాక్టర్లు క్షేత్రస్థాయిలో తూతూమంత్రంగా పనులు చేసి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.
- జలమండలి అధికారులతో పాటు సిబ్బంది సరైన చర్యలు తీసుకోకపోవడంతో రాబోయే వర్షా కాలంలో స్థానికులకు సమస్యల తిప్పలు తప్పని పరిస్థితులు ఎదురుకానున్నాయి.
- పాతబస్తీలోని కొన్ని ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ, మరికొన్ని ప్రాంతాల్లో జలమండలి పర్యవేక్షణ లో మురికినాలాలున్నాయి. ఓపెన్ నాలాలతో పాటు క్లోజ్‌డ్ డ్రైనేజీలలో పేరుకుపోయిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు సకాలంలో తొలగించకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి.

పూర్తిస్థాయిలో జరగని పనులు...

పూర్తిస్థాయిలో పూడికతీత పనులు సక్రమంగా జరగకపోవడంతో భారీగా వర్షాలు కురిసినప్పుడు వరదనీరు సక్రమంగా వెళ్లేందుకు వీలు లేకపోవడంతో ఆయా పరిసరాల్లోని లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమవుతుంటాయి. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో డ్రైనేజీ, కచ్చామోరీలు, ఓపెన్ నాలాలు మట్టి, చెత్తకుప్పలతో కూరుకుపోయాయి. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేని కారణంగా కొంత మంది కాంట్రాక్టర్లు నామ మాత్రంగా పనులు చేసి వదిలేస్తున్నారని పెదవి విరుస్తున్నారు.

ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు...

ప్రతి ఏటా వర్షాకాలానికి ముందే సంబంధిత ప్రభుత్వ విభాగాల అధికారులు పూడికతీత పనుల కోసం నిధులను వినియోగిస్తున్నారు. ఈ నిధుల వినియోగం సక్రమంగా జరగడం లేదు. నామ మాత్రంగా పనులు చేసి చేతులు దులుపుకుంటున్న కాంట్రాక్టర్లపై సంబంధిత ఉన్నతాధికారుల నిఘా కొరవడుతోంది. దీంతో తూతూ మంత్రంగా పనులు చేస్తున్నారు. పూడికతీత పనులు సక్రమంగా జరగకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటే సమస్యలు ఉత్పన్నం కావని లోతట్టు ప్రాంతాల బాధితులు అంటున్నారు.

ప్రజల్లో అవగాహన అవసరం..

ఓపెన్ నాలాల్లో స్థానికులు తమ ఇళ్లల్లోని చెత్తాచెదారం వేయకుండా ఉండాలని సంబంధిత అధికారులు కోరుతున్నారు. ఓపెన్ నాలాలకు ఇరువైపుల గృహాలు నిర్మించుకుని జీవిస్తున్న స్థానిక ప్రజలు ఎంతో అప్రమత్తంగా ఉండాలంటున్నారు. ఎట్టి పరిస్థితుల్లో నాలాల్లో చెత్త వేయకూడదని, ఓ వైపు ప్రభుత్వం ఓపెన్ నాలాల్లో పేరుకుపోతున్న వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తుండగా.. మరోవైపు స్థానికులు తమ ఇళ్లు, దుకాణాల్లోని పనికిరాని చెత్తను ఓపెన్ నాలాల్లో వేయడం సరికాదంటున్నారు. ఓపెన్ నాలాల్లో చెత్త వేయకుండా స్థానిక ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం సంబంధిత అధికారులపై ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



డబీర్‌పురాలోని ఓపెన్ నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలు ఇలా..

ఇంప్యాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్‌గా ప్రభాకర్



సర్టిఫికెట్‌ను ప్రదానం చేస్తున్న ఆదినారాయణరెడ్డి

గన్‌ఫౌండ్రీ: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పరీక్ష సమయాల్లో మానసిక ఒత్తిడికి గురికాకుండా మోటివేషన్ క్లాసులు ఇచ్చేందుకు తనవంతు కృషి చేస్తానని ఇంప్యాక్ట్ ఫౌండేషన్ ట్రైనర్ సీహెచ్. ప్రభాకర్ తెలిపారు. ఆదివారం ఇంప్యాక్ట్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఆదినారాయణరెడ్డి చేతుల మీదుగా సర్టిఫైడ్ ట్రైనర్ సర్టిఫికెట్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు, వర్ధమాన వ్యాపారులు, ఉద్యోగస్తులు వారి వృత్తినైపుణ్యాలను పెంపొందించుకునేలా తన శిక్షణ ఉపయోగ పడుతుందని తెలిపారు. తనకు సర్టిఫికెట్‌ను అందజేసిన ఇంప్యాక్ట్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

అయోధ్యకు స్థానిక నేతలు



బీజేపీ కిసాన్‌మోర్చ ప్రధాన కార్యదర్శి కృష్ణగుప్తా

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గానికిచెందిన బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు అయోధ్యకు తరలివెళ్లారు. గోల్కొండ జిల్లా బీజేపీ కిసాన్‌మోర్చా ప్రధాన కార్యదర్శి ముక్క కృష్ణాగుప్తాతో పాటు పలువురు నాయకులు అయోధ్యలో రామ్‌లల్లాను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణాగుప్తా మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎక్కడలేని విధంగా అయోధ్య రామమందిరం నిర్మాణం జరిగిందన్నారు. భారతదేశంలోని ప్రతి హిందువు గర్వపడేలా రామ మందిర నిర్మాణం ఉందన్నారు.

ఆకట్టుకున్న గ్లోబల్ కల్చరల్ ఫెస్టివల్



సినీనటి జయసుధను సత్కరిస్తున్న ఎగ్జిబిషన్ నిర్వాహకులు

అబిడ్స్: ఎగ్జిబిషన్‌లో గ్లోబల్ కల్చరల్ ఫెస్టివల్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రముఖ టాలీవుడ్‌సింగర్ సునీత గీతాలను ఆలపించారు. ఎగ్జిబిషన్ సొసైటీ సభ్యులు వారిని ఘనంగా సత్కరించారు. ఈ వేడుకల్లో ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షులు వనం సత్యేందర్, కార్యదర్శి హనుమంతరావు, కోశాధికారి రాజేంద్రకుమార్, జాయింట్ సెక్రటరీ చంద్రజిత్, వనం సత్యేందర్, కార్యదర్శి హనుమంతరావు, కోశాధికారి రాజేంద్రకుమార్, జాయింట్ సెక్రటరీ చంద్రజిత్‌సింగ్, గ్లోబల్ కల్చరల్ ఫెస్టివల్ అడ్వైజర్ ప్రభాకర్, కన్వీనర్ ముక్కోర్ హైదర్ తదితరులు పాల్గొన్నారు.



డబీర్‌పురాలో పర్యటిస్తున్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

పాతబస్తీలో ఒవైసీ పర్యటన

చార్మినార్: పాతబస్తీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో కులమతాలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఆదివారం పాతబస్తీలోని పత్తర్‌గట్టి, రెయిన్‌బజార్, డబీర్‌పురాలలో ఆయన యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్‌తో పాటు మజ్లిస్ పార్టీ ఎమ్మెల్సీ మీర్జా రెహమత్‌బేగ్, పత్తర్‌గట్టి కార్పొరేటర్ సొహేల్ ఖాద్రీలతో కలిసి పర్యటించి రూ.7.19 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. స్థానిక బస్తీలలో పాదయాత్ర నిర్వహించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

- యాకుత్‌పురాలోని డబీర్‌పురాలో రూ.3.77 కోట్ల నిధులతో మేజర్ నాలా పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎంపీ లాడ్స్ నిధులతో పాతబస్తీలో ఇప్పటికే పలు అభివృద్ధి పనులను నిర్వహించామన్నారు.
- డబీర్‌పురాలో దశాబ్దాలుగా మురికి నీటితో పాటు వరదనీటి సమస్యలకు కారణమవుతున్నా.. డబీర్‌పురా నాలా పనులను చేపట్టామన్నారు. స్థానిక ప్రాంతాలకు చెందిన ప్రజలకు ఏవైనా సమస్యలు తలెత్తితే తమ పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులతో పాటు స్థానిక మజ్లిస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వెంటనే స్పందించి ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. మజ్లిస్ పార్టీ ఓబీసీ విభాగం ఇన్‌చార్జి ఆర్.దీపేష్‌రాజ్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

గోసేవలో బీజేపీ నేత



బీజేపీ నాయకుడు సునీల్‌యాదవ్

గోల్కొండ: గోసేవకు మించిన సేవ మరేది లేదని బీజేపీ గుడిమల్కాపూర్ డివిజన్ అధ్యక్షుడు సునీల్ యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన గుడిమల్కాపూర్‌లోని గోషాలలో గోసేవ చేశారు. ఈ సందర్భంగా ఆయన గోశాలను శుభ్రం చేసి గోవులకు మేత వేసి గోసేవలో పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం



సాయిపవన్ (ఫైల్)

అబిడ్స్: మంగళ్‌హాట్ ఇందిరానగర్‌లో ఓ బాలుడు అదృశ్యమైన ఘటన మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చోటు చేసుకుంది. ఎస్సై సుబ్రమణ్యం తెలిపిన వివరాల ప్రకారం.. ఇందిరానగర్‌లో నివసించే సాయిపవన్(14) ఈనెల 9న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. సదరు బాలుడి తల్లి రేణుక పలు ప్రాంతాల్లో ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిస్తే మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్‌కి సమాచారం ఇవ్వాలని ఎస్సై వివరించారు.

అభివృద్ధిలో వివక్షకు తావులేదు

కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్



మజ్లిస్ నేతలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అభివృద్ధి పనుల్లో వివక్షకు తావులేదని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని కార్యాలయంలో తనను కలిసేందుకు వచ్చిన మజ్లిస్ నేతలతో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, కుల మతాలకు అతీతంగా ప్రతి బస్తీ, కాలనీలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించి పనులను పూర్తి చేయిస్తున్నామన్నారు. కుల సంఘాలు, కాలనీ సంక్షేమ సంఘాల వారికి తాను ఎప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కుల సంఘాల భవనాలు, కమ్యూనిటీహాల్స్ నిర్మాణంతో పాటు కాలనీల్లో అభివృద్ధి పనులను పూర్తి చేయిస్తామన్నారు. త్వరలోనే అభివృద్ధి పనులు పూర్తవుతాయని స్పష్టం చేశారు. టోలిచౌకీ డివిజన్ మజ్లిస్ నాయకులు హారూన్‌ఫరాన్, అలీముద్దీన్, సయ్యద్ జబ్బార్, సయ్యద్ రఫత్ హుస్సేన్ తదితరులున్నారు.

షేక్‌పేట్‌లో నూతన జ్యువెలరీ ప్రారంభం



ఆభరణాలను ప్రదర్శిస్తున్న వీకే అగర్వాల్

గోల్కొండ: హైదరాబాదీ నిజామీ సంస్కృతిని ప్రతిబింబిస్తూ.. సాంప్రదాయ ఆభరణాలతో దశాబ్దాలుగా కొనుగోలుదారుల ఆదరణ పొందుతున్నామని పి. సత్యనారాయణ్ సన్స్ జ్యువెలర్స్ ప్రతినిధి వినయ్‌కుమార్ అగర్వాల్ అన్నారు. ఆదివారం షేక్‌పేట్ పాస్‌పోర్టు సేవా కేంద్రం సమీపంలో నూతన షోరూమ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత 75 ఏళ్లుగా కొనుగోలుదారుల ఆదరణతో ముందుకు సాగుతున్నామన్నారు. ఆభరణాలు వాటి నిర్మాణ శైలి, గ్యారంటీ తదితర అంశాల్లో రాజీ లేకుండా కొనుగోలుదారుల అభిమానంతో పాటు విశ్వాసాన్ని కూడా పొందామన్నారు. ఉత్కర్ష్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

పాతబస్తీకి సందర్శకుల తాకిడి

- పెరిగిన చిరువ్యాపారాల గిరాకీ
- ట్రాఫిక్‌తో తప్పని తిప్పలు



చార్మినార్: పాతబస్తీకి సందర్శకుల తాకిడి పెరిగింది. ఆదివారం కావడంతో పర్యాటక స్థలాలు సందర్శకులతో కిటకిటలాడాయి. చార్మినార్, మక్కామసీదు, గుల్జార్‌హౌజ్, పత్తర్‌గట్టి, మదీనా, నయాపూల్ తదితర ప్రాంతాలన్నీ సందడిగా కనిపించాయి. సందర్శకులు పెరగడంతో చిరువ్యాపారాలకు గిరాకీ పెరిగింది. సాలార్‌జంగ్ మ్యూజియం, హెచ్‌ఈహెచ్ నిజాం మ్యూజియం, చార్మినార్, చౌమహల్లా ప్యాలెస్‌లతో పాటు నెహ్రూ జూలాజికల్ పార్కు పర్యాటకుల రద్దీతో కళకళలాడాయి. ఉదయం నుంచి సందర్శకులు ఎక్కువ సంఖ్యలో పాతబస్తీలోని పర్యాటక స్థలాలను సందర్శించారు.

చార్మినార్ వద్ద.. చారిత్రాత్మకమైన చార్మినార్ కట్టడం వద్ద సందర్శకులు సందడి చేశారు. చార్మినార్ కట్టడం నలువైపులా విశాలమైన ఖాళీ స్థలం అందుబాటులోకి రావడంతో పాటు అందమైన గ్రానైట్ రోడ్లు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. గుల్జార్‌హౌజ్ వద్ద వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. నడిచి వెళ్లేందుకు కూడా చోటు లేకపోవడంతో..సందర్శకులు నడిరోడ్డుపైనే వెళ్లారు. ఆదివారం సెలవు రోజు కావడంతో వాహనాల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. దీంతో అసలే బాటిల్ నెక్ రోడ్డైన గుల్జార్‌హౌజ్, మచిలీకమాన్, పత్తర్‌గట్టి, మదీనా తదితర చార్మినార్ ప్రధాన రోడ్లపై ట్రాఫిక్ తిప్పలు తప్పడం లేదు.

క్రీడాకారుల సంక్షేమానికి టీఎన్జీఓ సహకారం



క్రికెట్ సభ్యులతో డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని

అబిడ్స్: క్రీడాకారుల సంక్షేమానికి టీఎన్జీఓస్ తరపున నిరంతరం పలు విధాల సహకారం అందిస్తున్నామని టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేన్ అన్నారు. ఎంఎస్ కే వరల్డ్ వన్ ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడమీలో జరిగిన పోటీల్లో ఆయన పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ... ప్రతి ఏటా ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించి వారిని ప్రోత్సహిస్తున్నామన్నారు. తమ టీఎన్జీఓ ఆధ్వర్యంలో క్రీడల అభివృద్ధికి, క్రీడాశాఖ సంక్షేమం, క్రీడాకారులకు అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. చిన్నప్పటి నుంచే క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

నేటి నుంచి బొడ్రాయి, విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు

జియాగూడ: ఈనెల 12 నుంచి జియాగూడ ఇమాంపురాలో బొడ్రాయి నాభిశిల, రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు నవభారత్ సంఘం అధ్యక్షులు మదిర సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఇమాంపురా ఎస్‌బీఎస్ కమ్యూనిటీహాల్‌లో ఆయన మాట్లాడారు. ఆదివారం సాయంత్రం బొడ్రాయి శిల, రేణుకా ఎల్లమ్మ విగ్రహాల ఊరేగింపు ఇమాంపురాలో కొనసాగుతుందన్నారు. 12న ఉదయం ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నదానం, 13న యజ్ఞమహోత్సవం, 14న ఉదయం 6 గంటలకు బస్తీవాసులు తమ ఇళ్లల్లో జంటలు బియ్యం పోసుకున్న తర్వాత ఉదయం 7 గంటలకు కమ్యూనిటీహాల్ వద్దకు చేరుకుంటారని బొడ్రాయి నాభిశిల, రేణుకా ఎల్లమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపన, బోనాల వేడుకలు, మధ్యాహ్నం అన్నదానం ఉంటుందని వివరించారు. 15న ప్రత్యేక పూజల అనంతరం పుట్టింటి ఆడపడుచులకు కొత్తబట్టలు పెట్టి బియ్యం పోస్తారని, అనంతరం బోనాల ఊరేగింపు ఉంటుందన్నారు.

యాదవ సంఘం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ



గోల్కొండ: యాదవ సంఘం భవన పరిరక్షణ, భవన నిర్మాణం కోసం యాదవ సోదరులంతా ఐక్యంగా ఉండాలని కార్వాన్ యాదవ సంఘం అధ్యక్షులు బోడి అశోక్‌యాదవ్ అన్నారు. యాదవ సంఘం భవన పరిరక్షణ కోసం ఆదివారం గుడిమల్కాపూర్‌లో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 20 ఏళ్లకు పైగా ఈ స్థలం ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా తమ ఆధీనంలో ఉందని అయితే గతవారం ఇది ప్రభుత్వ స్థలం అంటూ.. ఆసిఫ్‌నగర్ తహశీల్దార్ కార్యాలయం వారు భవనాన్ని కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ స్థలం తమదేనంటూ ఎంతగా చెప్పినా.. వినకుండా వారు కూల్చివేయడం సరికాదన్నారు. దీనిలో భాగంగానే తాము సంతకాల సేకరణ కార్యక్రమం చేపడుతున్నామన్నారు.

నేడు విజయమేరి ఆస్పత్రిలో గోల్డెన్ జూబ్లీ వేడుకలు



అబిడ్స్: ఈనెల 12న చింతలబస్తీ విజయమేరి ఆస్పత్రిలో ప్లాటీనం జూబ్లీ వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ సుశీల గాయామ్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం నాలుగున్నర గంటలకు ప్లాటీనం గోల్డెన్ జూబ్లీ వేడుకలు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహాలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభిస్తారన్నారు. అతిథులుగా అల్ఫోన్సా, వట్టోల్లీ, ప్రభుత్వ సలహాదారు మహ్మద్‌అలీ షబ్బీర్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, రైడీన్ రోచ్, డాక్టర్ వెంకట్ తదితరులు అతిథులుగా పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలు విధాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

16న జరిగే బంద్‌ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ధర్మానాయక్

సంతోష్‌నగర్: బీజేపీ విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 16న నిర్వహించే బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని గిరిజన సంఘం అధ్యక్షులు ఎం.ధర్మానాయక్ పిలుపునిచ్చారు. తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కమిటీ సమావేశం ఆదివారం సంతోష్‌నగర్‌లోని జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఫిబ్రవరి 16న నిర్వహించే దేశవ్యాప్త బంద్‌ను జయప్రదం చేయాలన్నారు. దేశంలో గిరిజనుల సంఖ్య పెరిగిన రిజర్వేషన్ సంఖ్య పెంచలేదన్నారు. కేంద్ర బడ్జెట్‌లో గిరిజనుల వాటా ప్రకారం నిధులు కేటాయించాల్సి ఉండగా.. పదేళ్లలో ప్రతి ఏటా నిధులు తగ్గిస్తూ గిరిజన అభివృద్ధికి ఆటంకంగా కేంద్ర ప్రభుత్వం మారిందని ఆరోపించారు. నాయకులు రామ్‌కుమార్‌నాయక్, ఎస్.కిషన్‌నాయక్, కృష్ణ నాయక్, ఆర్.శ్రీను నాయక్, నిరంజన్, ముని, చిన్న తదితరులు పాల్గొన్నారు.

తిరుమల దర్శనానికి టీపీసీసీ కార్యదర్శి



స్వామివారి సన్నిధిలో అమరేందర్‌రెడ్డి దంపతులు

చార్మినార్: టీపీసీసీ కార్యదర్శి యెలిమేటి అమరేందర్‌రెడ్డి దంపతులు తిరుమల తిరుపతి దేవస్థానాన్ని సందర్శించి వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల ప్రజలు ఆయురారోగ్యాలతో పాటు అష్టైశ్వర్యాలు కలిగి ఉండాలని కోరుతూ.. దేవున్ని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు.

బాలసాహిత్య రచయితలకు సత్కారం



పురస్కారాన్ని అందజేస్తున్న అనంత పద్మనాభరావు

గన్‌ఫౌండ్రీ: బాలల మనోవికాసానికి వ్యక్తిత్వ నిర్మాణానికి దోహదం చేసే బాలసాహిత్య రచయితలను గుర్తించి సత్కరించడం గొప్ప సంస్కారమని దూరదర్శన్ విశ్రాంత అదనపు డైరెక్టర్ జనరల్ అనంత పద్మనాభరావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో బాలసాహిత్య పరిషత్, మాచిరాజు బాలసాహిత్య పీఠం సంయుక్త ఆధ్వర్యంలో వసుంధర దంపతులకు మాచిరాజు సీతారామయ్య రత్నకుమారీల స్మారక పురస్కారం ఆదివారం రవీంద్రభారతిలో ప్రదానం చేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీతలు దాసరి వెంకటరమణ, చొక్కాపు వెంకటరమణ, కెనరా బ్యాంక్ విశ్రాంత చీఫ్ మేనేజర్ బీవీఎస్ శర్మ, ఆకాశవాణి విశ్రాంత అసిస్టెంట్ డైరెక్టర్ సీఎస్.రాంబాబు, బాలసాహిత్యం పీఠం వ్యవస్థాపకు లు మాచిరాజు కామేశ్వర్‌రావు, బాలసాహిత్య పరిషత్ కోశాధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కాలిగ్రఫీ ప్రదర్శన



కాలిగ్రఫీ ప్రదర్శనను తిలకిస్తున్న బాడిబిల్డర్ మోతేశామ్

గోల్కొండ: అందమైన చేతిరాత ఒక కలలాంటిదని ఈ కలకు కాలిగ్రఫీ అనేది ఒక మారుపేరని ప్రముఖ బాడీ బిల్డర్ మోతేశామ్ అలీఖాన్ అన్నారు. ఆదివారం టోలిచౌకీలోని డిలక్స్ కాలనీలోని వీనస్ హైస్కూల్ లో కాలిగ్రఫీ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలిగ్రఫీకి రోజురోజుకు డిమాండ్ పెరుగుతుందని కాలిగ్రఫీలో ప్రావిణ్యం ఉన్న వారికి మనదేశంతో పాటు ఇతర దేశాలలో కూడా ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు కాలిగ్రఫీ పట్ల అవగాహన కల్పిస్తే విద్యార్థులు పాఠశాల విద్య పూర్తయ్యే వరకు కాలిగ్రఫీలో ఉన్నతంగా రాణిస్తారన్నారు. దీనికి ఎలాంటి హద్దులు లేవని భాషల అడ్డంకులు కూడా లేవని ప్రపంచంలోని అన్ని భాషలను కాలిగ్రఫీ లిపిలో రాయొచ్చని వివరించారు. గత కొన్నేళ్లుగా నగరంలో సైతం కాలిగ్రఫీ ప్రదర్శనలు బాగా జరుగుతున్నాయని దీనిని చూసేందుకు ప్రజలు కూడా ఇష్టపడుతున్నారన్నారు. ఈ సందర్భంగా ఆయన ఎగ్జిబిషన్ గ్యాలరీలోని విద్యార్థుల కాలిగ్రఫీ చిత్రాలను చూసి అభినందించారు. కరస్పాండెంట్ మహ్మద్ ఇగాయత్ అలీఖాన్ తదితరులున్నారు.

మట్టి కుండలొచ్చేశాయ్!

- జోరుగా మార్కెట్‌లో విక్రయాలు
- ఆదిలాబాద్ రంజన్‌కు భారీ డిమాండ్



తూప్స్ రోడ్డు దెక్కన్ పార్కు వద్ద..

గోల్కొండ: వేసవికాలం ప్రారంభంలోనే మట్టి కుండలు జోరుగా అమ్ముడవుతున్నాయి. రేతిబౌలి, టోలిచౌకీ ఆసిఫ్‌నగర్ రోడ్డు, సెవన్ తూంబ్స్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో మట్టి కుండల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వేసవికాలంలో మట్టి కుండలలోని నీళ్లు తాగేందుకు ఎక్కువ మంది ఇష్టపడతారు. వీటితో పాటు దాహార్తిని మట్టికుండల నీరు తీరుస్తాయి. 'గరీబోల్ల ఫ్రిజ్' పేరుపడిన మట్టి కుండలు వివిధ సైజులలో లభిస్తున్నాయి. కాగా మట్టితో చేసిన కురాయి, బాటిల్స్ ఎక్కువగా అమ్ముడవుతున్నాయి. తయారీదారులు గత రెండు నెలల నుంచే మట్టి కుండల తయారీలో నిమగ్నమయ్యారు. కుండలకు నేడు మార్కెట్‌లలో మట్టికుండలు అమ్మేవారిలో ఎక్కువగా కుమ్మరులే ఉన్నారు. లంగర్‌హౌజ్, షేక్‌పేట్, కార్వాన్, గుడిమల్కాపూర్ తదితర ప్రాంతాలలో మట్టికుండలు తయారవుతున్నాయి. రెండు లీటర్లు, ఐదు లీటర్లు, పది లీటర్ల సామర్థ్యం గల కుండలు ఎక్కువగా అమ్ముడవుతున్నాయి. పది లీటర్ల నీటి సామర్థ్యం గల కుండలకు నల్లా పెట్టి అమ్ముతున్నారు. కాగా ఒక లీటరు మట్టి బాటిల్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ప్లాస్టిక్ బాటిల్‌ను మరిపించేలా ఈ బాటిల్స్‌ను తయారు చేస్తున్నారు.

అదిలాబాద్ రంజన్...

ఆదిలాబాద్ మట్టితో తయారైన మట్టి రంజన్‌లకు నేటికి డిమాండ్ ఉంది. అదిలాబాద్ మట్టితో తయారైన మట్టి కుండలలో నీటి రుచి అమోఘంగా ఉంటుంది. అంతేకాకుండా కుండలోంచి బయటకు తీసిన నీరు చాలా సేపు చల్లగా ఉంటుంది. ఒక గ్లాసు నీరు తాగితే దాహం తీరుతుందని అదిలాబాద్ కుండలను కొనేవారు అంటుంటారు. గతంలో అదిలాబాద్‌లోనే తయారైన రంజన్‌లను అదిలాబాద్ నుంచి హైదరాబాద్‌కు తెచ్చి అమ్మేవారు. అయితే కొందరు అదిలాబాద్ నుంచి మట్టిని తెచ్చి అందులో స్థానిక మట్టిని కలిపి కుండలు తయారు చేసి అమ్ముతున్నారు.

మట్టి కుండల ధరలు...

రెండు లీటర్ల మట్టి కుండ రూ.40–60, ఐదు లీటర్ల కుండ రూ.150–200, పది లీటర్ల మట్టి కుండ(నల్లాతో) రూ.250–300, అదిలాబాద్ రంజన్ రూ.300–350 గా మార్కెట్‌లో ప్రస్తుతం ధరలు పలుకుతున్నాయి.

పర్యాటకులతో గోల్కొండ కోట కిటకిట



గోల్కొండ: గోల్కొండ కోట పర్యాటకులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు ఉదయం నుంచే కోట టికెట్ కౌంటర్ ముందు బారులు తీరారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన పర్యాటకులు కోటను ఎంతో ఆసక్తిగా తిలకించారు. కోటలోని కుతుబ్‌షాహీ రాజుల నాటి ఫౌంటెన్‌ను ఆసక్తిగా తిలకించారు. నగీనాబాగ్, క్లాపింగ్ పోర్టిపో తదితర ప్రాంతాలలో ఉన్న భారీ ఫిరంగులు యువ పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. రాజులు వాడిన ఆయుధాల వివరాలను పర్యాటకులు అడిగి తెలుసుకున్నారు. మరోవైపు విజ్ఞాన విహార యాత్రకు వచ్చిన విద్యార్థులు సైతం కోటలో కేరింతలు చేస్తూ.. సందడి చేశారు. విశాలమైన కోట గోడలు, భారీ బండరాళ్లతో నిర్మించిన భక్త రామదాసు బందీఖానాను విద్యార్థులు చూసి ఆశ్చర్యపోయారు.